సొదుం జయరాం కథలు

26

# బ్రహ్మరాక్షసి

పిల్లలు ముగ్గురికీ అన్నాలు తినిపించి, తాను ఇంత తినేసరికి పక్కింటి గోడ గడియారం ఒకటి కొట్టింది. బయట ఎండ మిర్రి మిర్రి కాస్తోంది. పిల్లలు కాసేపు ఆడుకున్నారు. ఆ తర్వాత కాసేపు ఏడ్చి, మెల్లగా నిద్రలోకి జారుకున్నారు. పక్కలు పరిచి, పిల్లల్ని పండేసి, సుభద్ర వాకిటి దగ్గర కూచుంది. పిల్లలతోనూ, పనితోనూ అలత తగిలింది. ఆవిడ కళ్ళు యాంత్రికంగా మూతలుపడుతున్నాయి. ఉండి ఉండి అంతరాంతరాళ్ళోంచి ఏదో విషాదం తాలూకు ఆలోచన ఒకటి బయటకు తొంగిచూచింది. కళ్ళ మీదున్న నిద్ర టక్కున ఎగిరిపోయింది. ఆవిడ దేహం కొద్దిగా కంపించింది. అనుకోకుండానే ఒక సన్నటి మూలుగు అస్పష్టంగా గొంతునుంచి బయటపడ్డది.

సుభద్ర లేచి ఇంట్లోకి వెళ్ళింది. పెట్టె తెరిచి చిరుగులుపడ్డ రెండు జాకెట్లూ, పిల్లల అంగీలు రెండూ వెలికితీసి సూది, దారం తీసుకొని మళ్ళీ యధాస్థానంలోకి వచ్చి కూర్చుంది.

ఎంత ప్రయత్నించినా, ఆవిడ మనసు చేస్తున్న పనిమీద లగ్నం కావడం లేదు. ఎక్కడికో లాగుతోంది. ఏదో భయాన్ని, బయటకు తోడుతోంది. ఆమె దాన్ని విశ్వప్రయత్నంమీద చిరుగులమీదికి లాగుతోంది. ఒకటి రెండుసార్లు సూది వ్రేలికి గుచ్చుకొని సన్నటి రక్తపు చుక్కలు బయటపడ్డాయి.

పక్కింటి గడియారం ఈసారి రెండు కొట్టింది. సుభద్ర చిరుగులు కుట్టడం పూర్తిచేసింది. చిరుగులు ఇంకా ఎక్కడన్నా కనుతప్పిపోయినవేమోనని ఒక్కొక్కటి బార్లా విప్పి చూచింది. చిరుగులు పూర్తయ్యాయి. అన్నిటినీ వొత్తుగా మడిచి వాటితోనే ముఖం మీదున్న చెమట తుడుచుకుంది.

ఒక నిట్టూర్పు విడిచి వాకిలికి జారగిల బడ్డది. ఇందాకటి నుంచి బయటపడటానికి గింజుకుంటున్న ఆలోచనల్ని ఆపటానికి ఇక ఆవిడకు శక్యం కాలేదు.

సుభద్రకు ఉదయం సంఘటన కళ్ళముందు మెదిలింది. ఇంట్లోకూర్చొని బియ్యంలో రాళ్ళు ఏరుకుంటోంది. అక్కడ పగలే చీకటి. సగానికి సగం రాళ్ళున్నా ఒక్కటీ కన్పించి చావడం లేదు. సుభద్ర బియ్యం చేట తీసుకొని తలవాకిట కూర్చుంది.

రాళ్లు ఏరటం పూర్తిచేసి లేవబోతున్నది. రఘు వచ్చాడు. వచ్చీ రావడంతోనే 'మా అన్నయ్య రాలేదా?' అన్నాడు.

'లేదే! నువ్వెప్పుడొచ్చావు?' అన్నది యధాలాపంగా.

'రాత్రి మెయిలుకు వచ్చాను. అన్నయ్య కూడా వచ్చివుంటాడనుకున్నానే. బహుశా ఇవ్వాళ సాయంత్రం వస్తాడేమో' అన్నాడు.

సుభద్ర బియ్యంచేట ఇంట్లోపెట్టి మంచం వాల్చి రఘుని కూర్చోమంది. సుభద్ర కింద కూచొని 'పేపర్లు దిద్దటమూ అదీ ఉంటుంది. పదో తారీఖుగానీ రాలేనని వారం కిందట రాశాడు. ఇవ్వాళ తారీఖు నాలుగు కాదూ? ఇవ్వాలెట్లా వస్తాడు?' అన్నది సుభద్ర.

'పేపర్లు దిద్దటమూ లేదు పాడూ లేదు. పూస్టు చేశారు. చక్కా ఇవ్వాళ సాయంత్రం దిగుతాడు' అన్నాడు రఘు.

పూస్టు అన్న పదం సుభద్రకి అర్థం కాలేదు. ఆవిడ అయోమయంగా రఘు ముఖంలోకి చూచింది. సుభద్ర పరిస్థితి గ్రహించి 'అన్నయ్యని ఉద్యోగంలోంచి తీసివేశారమ్మా' అన్నాడు రఘు.

సుభద్ర కొయ్యబారిపోయింది. ఆవిడకు గొంతు పెగల్లేదు. చాలా సేపటికి నోరుతెరిచి 'మీ అన్నయ్యతో నువ్వు మాట్లాడావా?' అన్నది. ఎంత ప్రయత్నించినా కంఠంలో వణకులేకుండా చేయలేకపోయింది సుభద్ర.

రఘు మాట్లాడలేదన్నట్లు తల అడ్డంగా తిప్పాడు. సుభద్రకి ప్రాణం చచ్చి వచ్చింది. 'మరి నీకెట్లా తెలుసు అన్నయ్య ఉద్యోగం పోయిందని?'

'నాకు తెలుసమ్మా - దేశంలో కొన్నివేలమందిని గవర్నమెంట్ తీసివేసింది' గవర్నమెంట్ అన్నపదం వినగానే - సుభద్రకి భయంతో వళ్ళు కంపరమెత్తింది. చాలా రోజుల తర్వాత ఆమెకి పాతస్మృతి కళ్ళముందు మెదిలింది.

సుభద్ర వీధిబళ్ళో చదువుకునే రోజుల్లో రంగారావనే టీచరుండేవాడు. ఉన్నట్టుండి ఒక్కరోజు రంగారావు పెట్టే బేడా సర్దుకొని వూరువిడిచి వెళ్ళాడు. ఎందుకు వెళ్ళాడో సుభద్రకి అర్థం కాలేదు. నాన్నను అడిగింది. 'ఆయన కమ్యూనిస్టు అని గవర్నమెంట్ ఉద్యోగంనుంచి తీసివేసిందమ్మా' అన్నాడు నాన్న.

కమ్యూనిస్టులని ఉద్యోగాలనుంచి ఎందుకు తియ్యాలో సుభద్రకి బోధపడలేదు. మరికొన్నాళ్ళకి ఊళ్ళో అంతా చెప్పుకున్నారు. రంగారావుని గవర్నమెంట్ కాల్చి చంపిందని.

ఆ వార్త విని సుభద్ర వణికిపోయింది. గవర్నమెంట్‌కీ, తను విన్న తాటకీ, మారీచుడూ, రావణుడూ మొదలైన రాక్షసులకీ-సుభద్రకి అట్టే భేదం కనిపించలేదు. గవర్నమెంటనే పెద్దరాక్షసి బొమ్మ హృదయంలో ముద్రపడిపోయింది. ఆ ముద్ర నిన్న మొన్నటి వరకు హృదయంనుంచి చెరగలేదు.

తన భర్త రాఘవరావుకి గవర్నమెంట్ టీచరు ఉద్యోగమిచ్చాక ఆ ముద్ర చెరిగిపోయింది. గవర్నమెంట్ తను అనుకున్నట్టు బ్రహ్మరాక్షసి కాదు. అది కొంతమందిని ఉద్యోగాలిచ్చి పోషిస్తుంది. కమ్యూనిస్టుల్ని మట్టుకు ఉద్యోగాల్నుంచి తీసివేస్తుంది. అవసరమనుకుంటే కాల్చివేస్తుంది. మొత్తంమీద అది మరీ అంతహృదయం లేని రాక్షసి కాదు.

అందుకే రఘు కొన్ని వేలమంది ఉద్యోగుల్ని గవర్నమెంట్ తీసివేసిందంటే సుభద్రకి నమ్మశక్యం కాలేదు. ఇన్ని వేలమంది ఉద్యోగులూ, వారి భార్యా, బిడ్డలూ ఏమయ్యేట్టు? ఆకులలో మలుమేసి చావవలసిందేనా?

'నిజమే చెబుతున్నావా రఘూ?' అన్నది సుభద్ర.

'నిజమేనమ్మా నామీద ఒట్టు' అన్నాడు రఘు.

'బహుశా వాళ్ళంతా కమ్యూనిస్టులేమో' సుభద్ర సందేహం వెలిబుచ్చింది.

రఘు ఇల్లెగిరి పోయేట్టు నవ్వి, 'పోనీ నేను కమ్యూనిస్టునా? నన్ను కూడా తీసివేశారు కదా?' అన్నాడు.

ఎవరు కమ్యూనిస్టులో, ఎవరు కాదో పోల్చుకునేందుకు ఏ ఆధారం వుంది? ఆ విషయం గవర్నమెంట్‌కి తెలుస్తుంది. ఎవరు చూడొచ్చారు రఘు కమ్యూనిస్టేమో!

'అయితే గవర్నమెంట్ వీళ్ళందర్నీ ఎందుకు తీసేస్తున్నట్టు?'

'జీతాలివ్వడానికి గవర్నమెంట్ దగ్గర డబ్బులేదట. రఘు చెబుతున్నది అబద్ధం అని రూఢిగా నమ్మడానికి సుభద్రకి ఎంతసేపో పట్టలేదు. గవర్నమెంట్‌కి డబ్బు లోటేమిటి? వెండి రూపాయలిస్తున్నదా? బంగారు కాసులిస్తున్నదా? కాగితాల పాసు ఎన్నయినా అచ్చువేయవచ్చు. రఘులాటి వాళ్ళని గవర్నమెంట్ తీసివేసిందంటే కమ్యూనిస్టులయి ఉంటారు. అంతకు తప్ప మరేం లేదు. తన భర్తను ఉద్యోగం నుంచి ఎవరూ తీయరు. తను నిశ్చింతగా ఉండవచ్చు.

రఘు లేచి వెళ్ళిపొయ్యేడు. సుభద్ర తనపనిలో మునిగిపోయింది. పనిచేస్తుండగా, రఘు మాటలు జ్ఞాపకం వచ్చి 'అట్లా ఎన్నటికీ జరగదు. అట్లా ఎన్నటికీ జరగదు' అని తనకు తానే సర్ది చెప్పుకుంది.

ఎదురింటి గోడ గడియారం నాలుగు కొట్టింది. పక్కింటి సీతమ్మ గారు వచ్చి 'ఏమిటే సుభద్రా ఆలోచిస్తూ కూచున్నావు. నాలుగైంది. అన్నం వుడకబెట్టే పనిలేదేమిటి?' అన్నది.

సుభద్ర వులిక్కిపడ్డది. సర్దుకొని కూర్చొని 'ఎందుకు లేదు పిన్నీ, అన్నం చెయ్యాలి' అన్నది.

'విన్నావా పిన్నీ, కమ్యూనిస్టులందర్నీ ఉద్యోగం నుంచి తీసివేస్తున్నారట' అన్నది సుభద్ర.

'అలాగా' అన్నది సీతమ్మ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.

'మన ఎదురింటి రఘు లేడూ. ఆ అబ్బాయి చెప్పాడు అతణ్ణి కూడా తీసివేశారట' అన్నది సుభద్ర.

'మరి మీ ఆయన మాటేమిటే సుభద్రా.'

సుభద్రకు గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. 'లేదు పిన్నీ ఆయన్ను తీసివెయ్యరు' అన్నది.

'పోనీ అమ్మా అదృష్టవంతురాలివి' అన్నది సీతమ్మ.

సీతమ్మ అటు వెళ్ళగానే సుభద్ర బరువుగా వూపిరి పీల్చింది. లేచి అన్నం చేసే ప్రయత్నం చెయ్యాలనిపించలేదు. కాసేపు పిచ్చాపాటి మాట్లాడటానికి ఎవరయినా ఉంటే బాగుండుననుకున్నది. సీతమ్మ రెండు మాటలు మాట్లాడి వెళ్ళిపోయింది. ఆమె వెళ్తూ, 'పోనీ అమ్మా అదృష్టవంతురాలివి' అన్న మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. సుభద్ర ఒకటికి రెండుసార్లు 'నేను అదృష్టవంతురాల్ని. ఏ అశుభం జరగదు. జరగడానికి వీల్లేదు' ఆమె తనలో తనే గొణుక్కుంది.

ఎంత ప్రయత్నించీ, దురదృష్టపు రోజుల్ని, సుభద్ర జ్ఞాపకం చేసుకోకుండా ఉండలేకపోయింది. సరిగ్గా నాలుగేళ్ళనాడు తన పెళ్ళయింది. ఈ నాలుగేళ్ళలోనూ ముగ్గురు బిడ్డలు కలిగారు. ఆయనకు ఉద్యోగం దొరకలేదు. ఇంట్లో అంతా నానా యాతనలు పడ్డారు. మంచి తిండిలేదు. మంచి బట్టలు లేవు. ఈ గడ్డురోజులు ఎలా గడిపారో ఆ భగవంతుడికి తెలుసు.

సరిగ్గా మూణ్ణెళ్ళనాడు ఆయనకు ఎక్కడో దూరాన ఉద్యోగం దొరికింది. మొన్న మొన్ననే రెండువందలు మనియార్డరు చేశాడు. పిల్లలూ, తనూ ఇంత తినడానికి ఆసరా దొరికింది. గడ్డు రోజులు గడిచి మంచి రోజులు వచ్చాయి. తను అదృష్టవంతురాలు. తనని భగవంతుడు అన్యాయం చెయ్యడు.

పక్కింటి గడియారం విషాదంగా ఒకటి కొట్టింది. అపుడే నాలుగున్నర కామోసు అనుకుంది సుభద్ర. ఆలోచించి ఆలోచించి ఆవిడ మనసు అలసిపోయింది. ఆవిడ ఇంట్లోకి వెళ్ళడానికి లేచి నిలబడ్డది. కూచొని కూచొని కళ్ళల్లో రక్తప్రసరణ ఆగిపోయింది. తిమ్మెర్లెక్కి - కాళ్ళు కదపనివ్వడం లేదు.

సుభద్ర బజారుకేసి చూసింది. అల్లంత దూరాన చేతిలో పెట్టె పట్టుకొని కాళ్ళీడ్చుకుంటూ ఒక వ్యక్తి వస్తున్నాడు. గడపలో అడుగు పెట్టనంత వరకు 'ఆయన కాదు, ఆయన కాదు' అని అనుకుంటూనే ఉన్నది సుభద్ర.

తీరా గడపలో కాలుపెట్టిన భర్త ముఖంలోకి తదేకంగా ఒక క్షణం పరకాయించి చూచింది. ఉన్నట్టుండి భర్త వెనక మరో రూపం కనిపించింది. అది భయంకరంగా ఉన్న బ్రహ్మరాక్షసి! అది తన కబంధ హస్తాలు సాచి, తన భర్తను పట్టుకోడానికి ప్రయత్నిస్తోంది. సుభద్ర చలిజ్వరం ఉన్న రోగిలా వణికిపోయింది. ఆమె కంఠం నుంచి ఏదో అస్పష్టమైన ఆక్రోశం బయలుదేరింది. అడుగు వెనక్కి వేయబోయి కుప్పలా కూలి క్రిందపడ్డది.

- (సవ్యసాచి)